ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -67 పేజీలు - 08 వెల - 06/-
గురువారం19 జూన్ 2025





## రూ. 3వేలకే ఫాస్టాగ్
# వార్షిక పాస్

- వాహనదారులకు తీపికబురు.. కేంద్రం కీలక ప్రకటన!
- కేంద్రం నుంచి ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్ ప్రకటన
- ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి అమలు
- వార్షిక పాస్ ధర రూ.3000గా ఖరారు
- ఏడాది లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు
- కార్లు, , వ్యాన్ల వంటి నాన్-కమర్షియల్ వాహనాలకు వర్తింపు
- త్వరలో యాక్టివేషన్ లింక్ అందుబాటులోకి

2లో



## మధ్యవర్తిత్వం
# అబద్ధం..!

2లో

వాణిజ్య ఒప్పందమూ వట్టిదే

అమెరికాకు రావాలని కోరిన ట్రంప్

ముందస్తు కార్యక్రమాల వల్లకుదరదన్న మోదీ

క్వాడ్ సదస్సుకు మోదీ ఆహ్వానం ..

## పాక్ ప్రాధేయపడితేనే.. దాడులు ఆపాం..
### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో ఫోన్లో ప్రధాని మోదీ

**కననాస్కిన్ (కెనడా):** పాకిస్తాన్ ప్రాధేయపడితేనే ఆపరేషన్ సిందూర్ దాడులు ఆపామని, అంతే తప్ప ఎవ్వరి మధ్యవర్తిత్వంతో కాదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి స్పష్టం చేశారు. భారత్–పాక్ దేశాలు చేసుకున్న సీజ్ ఫైర్ ఒప్పందంలో అమెరికా ప్రమే యం ఎంత మాత్రమూ లేదని పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సిందూ ర్ ఇంకా కొనసాగుతున్నదని చెప్పిన మోడీ.. పాకిస్తాన్ బుల్లెట్లకు భారత్ బాంబులతో ప్రతిస్పందిస్తుందని అన్నారు. జీ7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు కెనడా వచ్చిన ప్రధాని మోడీ.. పలు వురు దేశాధినేతలతో సమావేశమయ్యారు. అయితే, తొలి సెషన్ సమ యంలోనే అమెరికాకు ట్రంప్ అర్థాంతరంగా వెళ్లిపోవడంతో.. బుధ వారం ఫోన్ చేసి మరీ ట్రంప్ మోడీ సంభాషించారు. వీరి సంభాషణ దాదాపు 35 నిమిషాల పాటు కొనసాగింది. ఈ నేపథ్యంలో దాయాది దేశంతో కాల్పుల విరమణతోపాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఎటువంటి మధ్యవర్తిత్వం అంగీకరించలేదని, భవిష్యత్లో కూడాఅంగీకరించబోమని ట్రంపుక్కు మోడీ స్పష్టం చేశారు.



## మావోయిస్టులకు మరో
# ఎదురుదెబ్బ

మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్..

ముగ్గురు మావోయిస్టులు మృతి

గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అరుణ, అంజు అనే ముగ్గురు మావోలు మృతి

2లో

## రాష్ట్రంలో పరిస్థితులు
# దారుణం

పల్నాడు జిల్లా రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన

ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

ఏపీలో అభివృద్ధి, సంక్షేమం లేవని, 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని విమర్శ

నాగమల్లేశ్వరరావును బెదిరించిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**సత్తెనపల్లి జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల గ్రామానికి చెందిన కోర్లకుంట వెంకటేశ్వరరావు కుటుంబానికి జరిగిన అన్యాయమే దీనికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన రెంటపాళ్లలో పర్యటించి, ఆత్మహత్యకు పాల్పడిన నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. మిగతాది 2లో...

## జగన్ పల్నాడు పర్యటనలో అపశృతి

కాన్వాయ్ ఢీకొని ఒకరు...

సొమ్మసిల్లి మరొకరు మృతి



# పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన

**అమరావతిజూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-** పన్నుల వసూళ్లలో అవగాహన కల్పించాలని, వేధింపులకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. పన్నులను సకాలంలో వసూలు చేయాల్సిందేనని అయితే ప్రజలపై ఒత్తిడి తేవద్దన్నారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. వ్యవస్థలో లొసుగులు వాడుకొని రెవెన్యూకు గండి కొడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల సేవలు యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. ఆదాయార్జనకు కొత్త మార్గాలు అన్వేషించాలని ఆదేశించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్
## ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి

నైపుణ్యాభివృద్ధికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్ జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-** హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు మిగతాది 2లో....

## కర్నూలులో హైకోర్టు బెంచ్ కు
# సహకరించండి



ఢిల్లీ పర్యటనలో బిజీగా మంత్రి లోకేశ్

వరుసగా కేంద్రమంత్రులతో భేటీ

రామ్ మేఘవాల్‌తో చర్చించిన లోకేశ్

చిరాగ్ పాశ్వాన్‌తో పలు అంశాలపై చర్చ

**న్యూఢిల్లీ, జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-** ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ' రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అక్కడి ప్రజల చిరకాల కోరికని అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి. మిగతాది 2లో...

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు



రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల

వ్యక్తిగత సంభాషణలు దొంగచాటుగా విన్నారన్న షర్మిల

ఇది వ్యక్తిగత గోప్యతకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్య

2లో

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

(మొదటి పేజి తరువాయి)

బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు."గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు.రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్

**న్యూఢిల్లీ, జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-**
జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఫాస్టాగ్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా వార్షిక పాస్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రైవేటు వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ముఖ్యంగా తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

**కేవలం రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్**

ఈ నూతన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. ఈ వార్షిక పాస్ పొందాలనుకునేవారు రూ.3000 చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ పాస్ యాక్టివేట్ చేసుకున్న నాటి నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే, అప్పటితో పాస్ గడువు ముగుస్తుంది. ప్రస్తుతం ఈ సౌకర్యం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర (నాన్-కమర్షియల్) వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని గడ్కరీ తన పోస్ట్‌లో వివరించారు.
దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జాతీయ రహదారులపై ఈ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. పాస్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి త్వరలోనే ఒక ప్రత్యేక లింక్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఈ లింక్ 'రాజ్‌మార్గ్' యాప్‌తో పాటు ఎన్‌హెచ్ఏఐ (భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ), ఎంఓఆర్‌టీహెచ్ (రహదారి రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ) అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.
ప్రయాణికుల నుంచి చాలాకాలంగా వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల టోల్‌ప్లాజాల వద్ద రద్దీ తగ్గడమే కాకుండా టోల్ రుసుముకు సంబంధించిన వివాదాలు కూడా తగ్గుముఖం పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది ప్రైవేటు వాహన యజమానులకు ఇది మరింత సౌకర్యవంతమైన, సులభతరమైన ప్రయాణ అనుభూతిని అందిస్తుందని మంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఫాస్టాగ్ వార్షిక పాస్.. గేమ్‌ఛేంజర్**
**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం**

జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం, భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ 'ఎక్స్ (ట్విట్టర్)' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు.ఫాస్టాగ్ వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలన్న ప్రయాణికుల చిరకాల డిమాండ్‌కు ఈ నిర్ణయంతో సరైన పరిష్కారం లభించిందని పవన్ పేర్కొన్నారు. టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఈ కొత్త విధానం ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు."రూ.3000 వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుంది" అని జనసేనాని పేర్కొన్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ, తరచూ ప్రయాణించే వారికి ఈ విధానం వల్ల సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల ఉన్న నిబద్ధతకు నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిదర్శనమని పవన్ కొనియాడారు.కాగా, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.3000 చెల్లించి ఈ పాస్‌ను పొందవచ్చని ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)' లో వెల్లడించారు. గడ్కరీ చేసిన ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. అయితే, ప్రస్తుతం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, వర్తించే నిబంధనలు ఇంకా వెలువడాల్సి ఉంది.

# రాష్ట్రంలో పరిస్థితులు దారుణం

(మొదటి పేజి తరువాయి)

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున రెంటపాళ్ల ఉపసర్పంచ్‌గా ఉన్న నాగమల్లేశ్వరరావుపై తెలుగుదేశం, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేశారని జగన్ ఆరోపించారు. ఆ ఆరోపణలతో పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా అవమానించారని అన్నారు. ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు వచ్చిన తర్వాత నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడులు చేసి, ఊరు విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే రౌడీ షీట్ తెరుస్తామని స్వయంగా సీఐ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు.
"జూన్ 5వ తేదీ రాత్రి పోలీసులు నాగమల్లేశ్వరరావును వదిలిపెట్టగా, ఆయన నేరుగా గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తన తండ్రి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి, పోలీసులు తనను బెదిరించిన తీరును వివరించారు. పోలీసుల వేధింపుల వల్లే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తండ్రి ఎంత ప్రయత్నించినా కుమారుడిని కాపాడుకోలేకపోయారు" అని జగన్ ఆవేదనగా చెప్పారు.నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు.
"నాగమల్లేశ్వరరావును బెదిరించిన ఆ సీఐపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? భార్య, కుమార్తె ఉన్న నాగమల్లేశ్వరరావు కుటుంబానికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు? ఘటన జరిగి ఏడాది గడిచినా ఆ కుటుంబం ఇంకా శోకంలోనే ఉంది" అని జగన్ ప్రశ్నించారు.
ఇదే నియోజకవర్గంలో లక్ష్మీనారాయణ అనే మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా పోలీసుల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని, ప్రస్తుతం ఆయన చావుబతుకుల మధ్య ఉన్నాడని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## జగన్ పల్నాడు పర్యటనలో అపశృతి

మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. జగన్ పర్యటనలో అపశృతి చోటు చేసుకుని ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే జగన్ కాన్వాయ్ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందగా.. ఇప్పుడు మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సత్తెనపల్లి గడియారం స్తంభం వద్ద ఆ పార్టీకి చెందిన కార్యకర్త సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సత్తెనపల్లి కి చెందిన జయవర్ధన్ రెడ్డిగా గుర్తించారు. జయవర్ధన్ రెడ్డి సత్తెనపల్లిలో ఆటోమొబైల్ షాపును నిర్వహిస్తున్నాడు. అయితే క్లాక్ టవర్ వద్ద జగన్ రెడ్డి రాకతో ఒత్తిడి పెరిగింది. ఈ సమయంలో అక్కడే ఉన్న జయవర్ధన్ ఊపిరి ఆడక కిందపోయాడు.

# మధ్యవర్తిత్వం అబద్ధం..!

**జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-**
కెనడా నుంచి తిరిగి వెళ్తున్న సమయంలో అమెరికా రావాలని మోడీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. అయితే, ముందస్తు షెడ్యూల్ ఉన్న కారణంగా మీ ఆహ్వానాన్ని మన్నించలేనని భారత ప్రధాని వివరించినట్లు విక్రమ్ మిస్త్రీ తెలిపారు. కాగా, త్వర లోనే ద్వైపాక్షికంగా భేటీ అవ్వాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. 'భారత్లో జరిగే క్వాడ్ సమావేశానికి రావాలంటూ మోడీ.. ట్రంప్ను ఆహ్వానించారు. మోడీ ఆహ్వానాన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు' అని మిస్త్రీ చెప్పారు. ఈ ఏడాది చివర్లో క్వాడ్ సమ్మిట్ను భారత్ నిర్వహించే అవకాశం ఉన్నది. చైనా ఆధిపత్యం చెలాయించ దానికి ప్రయత్నిస్తున్న ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నిర్ధారించడంలో క్వాడ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించినట్లుగా తెలుస్తున్నది. కాగా, మూడు దేశాల పర్యటన లో చివరి దశలో భాగంగా మోడీ కెనడా నుంచి క్రొయేషియాకు బయల్దేరి వెళ్లారు. భారత ప్రధాని ఈ బాల్కన్ దేశాన్ని పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం.సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరుపక్షాల సైన్యాల మధ్య జరిగిన చర్చల సమయంలో తీసుకున్నారని, అమెరికా మధ్యవర్తిత్వం లేకుండానే నేరుగా ఒప్పందం తీసుకున్నారని ట్రంప్తో చెప్పడంతో... కాల్పుల విర మణకు తాను మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ చేసిన వాదనలను తిప్పికొట్టారు. ఈ విషయాలను ట్రంప్కు ఫోన్లో స్పష్టం చేసినట్లు కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. పహల్గాం ఉగ్ర వాద దాడి అనంతరం ట్రంప్.. మోడీకి ఫోన్ చేసి సంతాపం తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత వీరిద్దరూ ఇప్పుడే మాట్లాడుకోవడంతో 'ఆపరేషన్ సిందూర్' వివరాలను అమెరికా అధ్యక్షుడికి మోడీ వివ రించారు. 'పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చ జరగలేదు. భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వం పెనా చర్చ జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్-పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ ప్రాధేయ పడటంతో ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడే కాదు, ఎప్పు దూభారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని ట్రంప్కు మోడీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉన్నది' అని మిస్త్రీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ -ఇరాన్ మధ్య వివాదం, రష్యా-ఉక్రెయిన్ వివాదం గురించి కూడా ట్రంప్, మోడీ చర్చించారు. వీలైనంత త్వరగా శాంతి కోసం రష్యా -ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష సంభాషణ అవసరమని, దీని కోసం ప్రయత్నాలు కొనసాగించాలని ఇరువురు నేతలు అంగీకరించారని వ్యక్తం చేశారు.

# అమిత్ షాతో మంత్రి నారాలోకేశ్ భేటీ

ఏపీ మంత్రి నారా లోకేశ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు 25 నిమిషాల పాటు సాగింది. రాష్ట్రానికి సంబంధించిన అనేక కీలకమైన అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.
ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను లోకేశ్ వివరించారు. ఈనెల 21న విశాఖలో ప్రధాని మోదీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ కొత్తప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని అమిత్ షాకు అందజేశారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేశ్‌ను అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం ఏపీని అభివృద్ధి బాటలో నడిపిస్తుంది, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని అమిత్ షా భరోసా ఇచ్చారు.ఈ సమావేశం అనంతరం లోకేశ్ మరికొందరు కేంద్ర మంత్రులను కూడా కలవనున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, అర్జున్‌రామ్ మేఘ్వాల్‌ను ఆయన కలవనున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా లోకేశ్ ఈరోజు ఉదయం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో కూడా మర్యాదపూర్వకంగా భేటీ అయిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో వరుస భేటీలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు

**రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు.తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు.ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు.
గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు.

## అడవుల్లో ఎన్‌కౌంటర్..
# ముగ్గురు మావోయిస్టులు మృతి

**న్యూఢిల్లీ, జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-** మావోస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఇవాళ తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. చింతకూలు, కొయ్యలగూడెం, కొండమొదలు పరిసర అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. ఇందులో సెంట్రల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, జోనల్ కమిటీ సభ్యురాలు, ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి భార్య అరుణతో పాటు మరో మావోయిస్టు అంజు ఉన్నారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరి కొంతమంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో మారేడుమిల్లి అడవుల్లో గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కర్నూలులో హైకోర్టు బెంచ్ కు
# సహకరించండి

(మొదటి పేజి తరువాయి)

న్యాయపరమైన అవసరాల కోసం రాయలసీమ ప్రజలు ఏపీ రాజధానికి రావడానికి 500 కి.మీ పైగా ప్రయాణించాల్సి ఉంటుంది. యువగళం పాదయాత్ర సందర్భంగా సీమ ప్రజలు, న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా త్వరితగతిన బెంచ్ ఏర్పాటుకు సహకరించాలి. రాష్ట్రంలోని కోర్టుల్లో జ్యుడిషియరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి సహకారం అందించండని కేంద్రమంత్రిని కోరారు. యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని లోకేశ్ కేంద్రమంత్రికి అందజేశారు. ఇకపోతే కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిశారు.. పండ్లతోటల అభివృద్ధికి అన్నివిధాల అనుకూలమైన వాతావరణం కలిగిన రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తో మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ? రాయలసీమలో రైతులు మామిడి, అరటి, టమోటా, బత్తాయి, దానిమ్మ, డేట్స్ వంటి పండ్లతోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.. యువగళం పాదయాత్ర సందర్భంగా వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశాను అన్నారు నారా లోకేష్? ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా అక్కడి రైతులకు మెరుగైన రేట్లు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సహకరించాలకు లోకేష్ కోరారు. దీనికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ? ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తాం. తిరుపతి ట్రిపుల్ ఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి నేను ఏపీకి వస్తున్నాను. జులై 11, 12 తేదీల్లో రాయలసీమ పర్యటనకు వస్తున్నా. మీరు కూడా వస్తే క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దాం. అన్నదాతలకు మేలు చేసేందుకు ప్రధాని మోడీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఈ సందర్భంగా చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేష్ అందించారు..

# క్రీడల అభివృద్ధికి కృషి





**కర్నూలు ప్రతినిధి జూన్ 17 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఒలంపిక సంగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్, హ్యాండ్ బాల్, యోగా పోటీలకు విశేష స్పందన లభించింది ఈ పోటీలను మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి, రాష్ట్ర యోగ అసోసియేషన్ చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ సీఈవో పి. విజయకుమార్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి షరీఫ్ అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఒలంపిక్ దినోత్సవం పురస్కరించుకొని అంతర్ పాఠశాలల పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఇలాంటి పోటీలలో నగరంలోని బాలబాలికలు పాల్గొనడం వారిలో దాగి ఉన్న ప్రతిభను ఇలాంటి పోస్టుల ద్వారా వెలికి తీసేందుకు ఆస్కారం ఉంటుందని తెలియజేశారు. ఈనెల 23వ తేదీన జరగనున్న ఒలంపిక్ పరుగులు పాల్గొన్నారు. అతిధులు అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి రుద్రా రెడ్డి, రాష్ట్ర యోగా అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మిగనూరు నేతలకు రాష్ట్ర స్థాయి పదవులు





**ఎమ్మిగనూరు: ప్రతినిధి జూన్ 17 ( రిపబ్లిక్ న్యూస్)**
వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగాల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నాయకులకు మాజీ ఎంపీ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక సహకారంతో ఎమ్మిగనూరు నాయకులు పి. రాజరత్నం రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శిగా, ఆర్. కాశీ విశ్వనాథ్ కార్యదర్శిగా నియామకాలు తెలిపారు. పార్టీ శ్రేణులు హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు మరింత శ్రమించి పార్టీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు.

# ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్ ఆధ్వర్యంలో నాటు సారా స్థావరాలపై దాడులు





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)** నవోదయము కార్యక్రమంలో భాగంగా నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తూ కల్లూరు మండలం కొల్లంపల్లి తండాకు సంబంధించిన శివారు ప్రాంతాల్లో నాటు సారాకు సంబంధించిన స్థావరాలను గుర్తించి వాటిని ధ్వంసం చేయడం జరిగినది. నాటు సారాకు ఉపయోగించు బెల్లం ఊట మరియు సంబంధిత బట్టీలు కనుగొని సుమారు 1000 లీటర్ల నాటు సారాకు ఉపయోగించు బెల్లం ఊట మరియు 30 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేయడం జరిగినది. తదుపరి వాటిని పరిశీలించగా లోకేష్ నాయక్ మరియు లక్ష్మణ నాయక్ లకు సంబంధించినదిగా తెలిసినది. కావున వీరిపై కేసు నమోదు చేయడమైనది. త్వరలో వీరిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు పంపడం జరుగుతుందని నాటు సారా తయారు చేయడం అమ్మడం రవాణా చేయడం చట్టరీత్యా నేరం అని తెలుపుతూ ప్రతి సభలోను ప్రతి గ్రామంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నాటుసారా పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేయుచున్న కృషికి అందరూ సహకరించాలని కోరుతూ నాటు సారాకు సంబంధించిన సమాచారం ఇచ్చినట్లయితే గోప్యంగా ఉంచబడుతుందని నాటు సారాలేని గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ దాడులలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్ మరియు సిబ్బంది చంద్రపాల్, రాజు రామలింగయ్య, మధు, ఈరన్న పాల్గొన్నారు

# ఫీజులు ఏమో లక్షల రూపాయలు వసతులు ఏమో ఆర కోర ..?

## విద్యతో వ్యాపారం చేస్తున్న నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ధర్నా: ఏఐఎస్ఎఫ్




**ఎమ్మిగనూరు ;ప్రతినిధి జూన్ 17 ( రిపబ్లిక్. న్యూస్)** ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నటువంటి నారాయణ విద్యాసంస్థలలో పుస్తకాల, యూనిఫాముల విక్రయిస్తూ వేల రూపాయలు వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రోజున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ కార్పొరేట్ కళాశాల ముందు ధర్నా చేపట్టడం జరిగిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విష్ణు, ఖాదర్, సహాయ కార్యదర్శి దస్తగిరి తెలిపారు. నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వ విధించినటువంటి నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా విద్యను వ్యాపారం చేస్తూ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తల్లిదండ్రులను మోసం చేస్తూ ఐపీఎల్, ఎం పి ఎల్ అంటూ మాయమాటలతో తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారని, ప్రభుత్వం నిబంధనలకు ప్రకారం విద్యాసంస్థల్లో ఎటువంటి పుస్తకాలు అమ్మకూడదని ప్రభుత్వం చెపుతున్న వాటిని తుంగలో తొక్కుతూ పుస్తకాలను ఒక్కో విద్యార్థికి 10 వేల నుంచి 22 వరకు పుస్తకాలను అమ్ముతున్నారని వారు తెలిపారు.విద్యార్థులను క్రీడల వైపు వెళ్ళకుండా యంత్రంలాగ తయారు చేస్తున్నారని మండిపడ్డారు. నారాయణ విద్యాసంస్థల విద్యా దోపిడీని అరికట్టకపోతే త్వరలోనే ఆర్ ఐ ఓ కార్యాలయం ముందు వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, బడేసాబ్,శ్రీను, సుమంత్, ఉదయ్, భార్గవ్, సాయికుమార్, వెంకటేష్, శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల పుటలకే పరిమితమైన కిశోరి సంక్షేమం

## కర్నూలులో బాలికల భవితవ్యానికి ఎవరు బాధ్యతవహించాలి?









**కర్నూలు ప్రతినిధి జూన్ 18(రిపబ్లిక్ న్యూస్)**
సర్కారు అందించే సంక్షేమ పథకాలు ఎంతో మంది జీవితం మారుస్తాయని నినదిస్తున్నా, వాస్తవం మాత్రం దానికి పూర్తిగా భిన్నంగా మారుతోంది. కర్నూలు జిల్లాలో అమలవుతున్న "కిశోరి బాలిక సంక్షేమం" కార్యక్రమం అదే ఉదాహరణగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా లింగ వివక్షత, సంపూర్ణ ఆరోగ్యం, నైతికత, బాల్య వివాహాల నివారణ, వ్యక్తిత్వ వికాసం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నది ప్రభుత్వ ఆశయం. కానీ ఈ ఆశయాలు కేవలం పోస్టర్ల వరకు మాత్రమే పరిమితమైపోతున్నాయన్నది ప్రజల వేదన. లింగ వివక్షత చదువు, పోషణ, స్వేచ్ఛల విషయంలో ఇంకా బాలికల పరిస్థితి మారలేదు. కొత్తగుంట ప్రాంతంలో ఏడాది క్రితం ఆరు బాలికలు చదువు మానేసి పనులకు వెళ్ళిపోవడంపై స్థానిక పత్రిక 'ఆంధ్రజ్యోతి' కథనం వెలువరించింది. సంపూర్ణ ఆరోగ్యం, పోషణమహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆహార సరఫరా చేస్తున్నా, ఊటుకూరు గ్రామం లో పరీక్షించినప్పుడు 35% బాలికలు గుండెకు బలహీనంగా ఉన్నారని ఆరోగ్య శాఖ నివేదిక తెలిపింది. నైతికత, బుద్ధిపర పరిణతిఇవి నేర్పే కార్యక్రమాలు పాఠశాలల్లో నామమాత్రంగా ఉంటున్నాయి. ఎక్కువగా అసిస్టెంట్ టీచర్లు లేకపోవడం, విద్యా ఉద్యోగుల అలసత్వం వల్ల కార్యక్రమం అసంతృప్తికరంగా సాగుతోంది.

**మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నివారణ**
2023లో నంద్యాల మండలంలో ఒకే నెలలో మూడు బాల్య వివాహాలు జరిగినట్లు 'సాక్షి' కథనంలో ప్రస్తావించబడింది. సదరు కేసుల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందన్నది ఇప్పటికీ సందేహాస్పదమే.

వ్యక్తిత్వ అభివృద్ధి, బుద్ధిపూర్వక వికాసం
ఈ అంశం పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నా, విద్యా కేంద్రాల్లో మౌలిక వసతుల లేకపోవడం వల్ల పాఠశాలలే సరైన అవగాహన ఇవ్వలేకపోతున్నాయి.

బాల్య వివాహాల అరికట్టడం
ఈ అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెబుతారు కానీ, సంఘున్మల్లా గ్రామం లో ఇటీవలే 15 ఏళ్ల బాలికకు వివాహం జరిపిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. లైంగిక వేధింపుల నివారణ ఈ అంశం పై బాలికలకు నేర్పించడం లేదు. 2024 లో అల్లగడ్డలో ఒక పాఠశాలలో జరిగిన వేధింపుల ఘటనపై చర్యలు తీసుకోకపోవడంపై 'ఈనాడు' ప్రత్యేక కథనం ప్రసారం చేసింది. ప్రశ్నించగల సామర్థ్యం, స్వీయ విశ్వాసంఅవగాహన లేక బాలికలు ప్రశ్నించాలనే ఆత్మస్థైర్యం కలిగి లేరు. రాజంపేట పరిధిలో బాలికలు సైలెంట్ గా వేధింపులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆధునిక బుద్ధి ప్రబోధనఇంటర్నెట్, డిజిటల్ పరిజ్ఞానం శిక్షణల్లో ఎక్కువగా బాలురే పాల్గొంటున్నారు. బాలికల హాజరు చాలా తక్కువగా ఉండడం గమనార్హం.

### ప్రధాన కారణాలు

పోస్టర్ల రూపంలోనే అవగాహన, ప్రాక్టికల్ శిక్షణలో లోపాలుఉపాధ్యాయులపై నిష్క్రియత
సర్వేలు లేవు, తప్పుడు డేటా ఆధారంగా రిపోర్టులు
తల్లిదండ్రులకు సరైన మార్గదర్శకత లేకపోవడం
నాణ్యమైన మౌలిక వసతుల లేమి, పథకం కేవలం ప్రచార నినాదంగా మిగిలిపోకూడదు. సమర్థవంతమైన కార్యాచరణ లేకుండా బాలికల భవిష్యత్ అంధకారంలోకి జారిపోకుండా మండల విద్యా అధికారులు, జిల్లా సంక్షేమ అధికారులు, పాఠశాల సిబ్బంది చేతుల్లో బాధ్యత ఉంది.
ప్రతి పాఠశాలలో బాలికల అభిప్రాయ సేకరణ
గ్రామ స్థాయిలో హెల్త్ క్యాంపులు మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో సున్నిత అంశాల అవగాహన
బాల్య వివాహ నిరోధంపై స్పెషల్ స్క్వాడ్లు

## పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో రోడ్డు భద్రతా నియమాలపై, నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించిన

# ఆత్మకూరు డిఎస్పి ఆర్.రామాంజి నాయక్

**పాములపాడు జూన్-18 రిపబ్లిక్ న్యూస్:-**
నంద్యాల జిల్లా ఎస్పీ- అధిరాజ్ సింగ్ రాణా(ఐపీఎస్) ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి- ఆర్.రామంజి నాయక్, ఆత్మకూరు రూరల్ సి.ఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్సై- కె.సురేష్ బాబు ల ఆధ్వర్యంలో పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో గ్రామసభ నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై, నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఆత్మకూరు డిఎస్పి- ఆర్.రామాంజి నాయక్, రూలర్ సీఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్సై- కే.సురేష్ బాబు లు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై పంచసూత్రాలు అయిన హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, మద్యం త్రాగి వాహనము నడపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ఓవర్ లోడ్ ఆటోలలో ప్రయాణం చేయరాదని, తెలియజేయడం జరిగింది. మీరు నడుపు వాహనములకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, నడిపే వ్యక్తికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు.

ఈ నెలలో పోలిస్ కానిస్టేబుల్ మరియు డీఎస్సీ ఎగ్జామ్స్ %వఇుుఎం% నిర్వహించడం జరిగింది. ఎవరైనా నాకు తెలిసినవారు ఉన్నారని, ఉద్యోగం ఇప్పిస్తానని చెబితే నమ్మి మోసపోవద్దని, అలా ఎవరైనా మిమ్మల్ని ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు సమాచారం తెలియజేయాలని



అన్నారు. ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ లోన్స్, ఆప్స్, ఓటిపి ల గురించి, ఆన్లైన్ ట్రాన్సక్షన్స్, ఆన్లైన్ లో ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని, అలాగే తెలిసినవారు ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామంటే కూడా నమ్మవద్దని, స్వయంకృషిని నమ్ముకోవాలని తెలియజేయడం జరిగింది .మహిళలపై జరిగే నేరాలు గురించి, బాల్య వివాహాల నిర్మూలన గురించి అవగాహన కల్పించడం జరిగింది.

దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు జరుగుతున్నాయి, కాబట్టి విలువైన ఆభరణములు, వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండవలెనని, ఒంటరిగా వెళ్లకూడదని,
ప్రస్తుతం పొలంలో విత్తనాలు వేసే సమయం వచ్చిందని, రైతులు గట్ల దగ్గర, నీళ్ల ప్రవహించే కాలువల విషయంలో గోడవపడే అవకాశం ఉన్నదని, కావున గొడవపడకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేశారు.

రైతులు పంట పొలాలకు మందులు కొట్టేటప్పుడు తప్పనిసరిగా నోటికి గుడ్డ కట్టుకోవాలని లేదా మాస్క్ వేసుకోవాలని తెలియజేయడం జరిగింది. లేనట్లయితే ఆ మందు పిచికారి చేసేటప్పుడు గాలిపీల్చి అస్వస్థకు గురవుతారని, ఇటీవల కాలంలో కొన్ని కుటుంబ కలహాలతో, అప్పులు అని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని కనుక ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకోకూడదని, మీకు ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.
ఇటీవల కాలంలో పిల్లలు సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని, తల్లిదండ్రులు పిల్లలు పట్ల జాగ్రత్తగా ఉండాలని, వారు ఎవరితో మాట్లాడుతున్నారో గమనించాలని తెలియజేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# యోగా ఏ మతానికి చెందింది కాదు

**ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలి**

**భారతీయ సంస్కృతిలో యోగ అంతర్భాగం**

**శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థులు**





**మంత్రాలయం, ప్రతినిధి జూన్ 17 ( రిపబ్లిక్ న్యూస్ )**
యోగా ఏ మతానికి చెందింది కాదని అన్ని మాతాల ప్రజలు యోగా చేసి ఆరోగ్యం గా ఉండాలని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుధేంద్ర తీర్థులు, మంత్రాలయం టీడీపీ ఇంచార్జి మాధవరం రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ఆవరణలో మధ్వ కారిడార్ లో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ,ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీపీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందు గా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మఠం ఏఏఓ మాధవ శెట్టి, మఠం మేనేజర్ ఎస్ కే శ్రీనివాస్ రావు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి యోగా ను ప్రారంభించారు. యోగా దినోత్సవం లో శ్రీ పరిమళ విద్యానికేతన్ విద్యార్థిని విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం పెద్ద ఎత్తున పాల్గొని యోగ పర్యవేక్షుల పరిధిలో యోగ ఆసనాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో యోగ అంతర్భాగమని, మనసులను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగ అత్యుత్తమ మార్గం అన్నారు. యోగా ఇలాంటి దినోత్సవాల్లో కాకుండా దిన చర్య గా చేసుకోవాలని సూచించారు. అప్పుడే అందరూ ఆరోగ్యంగా జీవించగలరని అన్నారు. ఆధునిక జీవనశైలి వలన ప్రజలు అనేక మానసిక,శారీరక ఇబ్బందులకు గురవుతున్నారని నిత్యం యోగ సాధన చేయడం ద్వారా ఇబ్బందులు లేని జీవితాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యం గా ఉండాలని సూచించారు. మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపిడిఓ నూర్జహాన్, సిఐ రామాంజులు, మంత్రాలయం ఇఓ ఉపేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇష్రాత్ బాష, నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఓ లు రెవెన్యూ, పంచాయతీ, ఐసిడిఎస్, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, మఠం అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జులై 5న అన్ని కోర్టు ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్

**కర్నూలు, ప్రతినిధి జూన్ 17 (రిపబ్లిక్ న్యూస్ )**

జిల్లా స్థాయిలో స్థానిక జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి/జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్థి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మరియు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ న్యాయవాదులు పోలీసు అధికారులు మరియు ఇన్సూరెన్స్, బ్యాంక్, మున్సిపల్, భూసేకరణ ఇతర సంబంధిత అధికారుల తో జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు మరియు మోటార్ ఆక్సిడెంట్, సివిల్ కేసులను, భూ సేకరణ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను జులై 5 వ తేదిన నిర్వహించడం




జరుగుతుందన్నారు. అందులో ఎక్కువ కేసులు పరిష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి ఈ లోక్ అదాలత్ ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. కోర్టు



మానిటరింగ్ పోలీసు లను కోర్టులలో ఉన్న కేసులను మానిటరింగ్ చేసుకొని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ల్యాండ్ అక్విజిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు,కర్నూలు మరియు నంద్యాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్స్ రామకృష్ణారెడ్డి,రాముడు, న్యాయ వాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, కర్నూలు మరియు నంద్యాల జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు నిరాశ్రయులైన

# అనాధ పిల్లలకు అందాలి

**కర్నూలు ప్రతినిధి జూన్ 17 (రిపబ్లిక్ న్యూస్ )**




జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రిరి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ దిశా నిర్దేశాలతో నిరాశ్రయులైన అనాధ పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డులను జారీ చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడానికి ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డి .సి పి .ఓ శారద అన్నారు. ఇందిరాగాంధీ నగర్ లో సాతి అవగాహన సదస్సులో జిల్లా సాది కమిటీ సభ్యులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలైన విద్యా ,వైద్యం, పునరావసం షెల్టర్ హోమ్లలో ప్రవేశం కల్పించడం ,స్కాలర్షిప్స్, మిడ్ డే మీల్స్ సదుపాయాల అర్హత కల్పించడం కోసం రోడ్డు పక్కన నివసిస్తున్న పిల్లలు, అనాధలు ,తల్లిదండ్రుల నుండి విడిపోయిన వారిని గుర్తించి వారికి ఆధార్ కార్డు ఇప్పించడం జరుగుతున్నదని అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సలహాలను అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో, మహిళా పోలీసు రాధిక ,అడ్వకేట్ శ్రీలక్ష్మి, స్వాతి కమిటీ సభ్యులు సుధారాణి, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది శ్వేత కీర్తి ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్ర నది తీరాన పవిత్రమైన మంత్రాలయం పుణ్యక్షేత్రంలో

# ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం







**మంత్రాలయం జూన్ 18(రిపబ్లిక్ న్యూస్):-**

తుంగభద్ర నది తీరాన పవిత్రమైన మంత్రాలయం పుణ్యక్షేతన ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు.బుధవారం ఉదయం పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వారి సౌజన్యంతో ఆదోని సబ్ కలెక్టర్ గారి ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగ మాసోత్సవాల కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆదోని సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పవిత్రమైన మంత్రాలయం సన్నిధిలో యోగా చేయడం ఒక అరుదైన అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవనంలో యోగా ను భాగం చేసుకోవాలన్నారు. మారుతున్న జీవన శైలిలో ఒంటరితనం, ఒత్తిడి, ఎక్కువగా ఉండటం వలన అనారోగ్యం వచ్చే అవకాశాలు ఉంటాయని వాటిని నియంత్రణ చేసేందుకు యోగా మంచి సాధనమన్నారు అందుకు గాను మనం మన జీవనశైలిలో యోగా ను ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లో హ్యాపీ లివింగ్ లో భాగంగా యోగా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు.. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించి ఆరోగ్యమైన జీవితాన్ని జీవించాలని కోరారు.మంత్రాలయం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సుభుదేంద్ర తీర్థులు స్వామి వారు మాట్లాడుతూ యోగా యావత్ మానవాళికి సంబంధించిన పక్రియ అన్నారు. ప్రతి ఒక్క జీవి ఆయుషు నియంత్రించుకోవడానికి యోగా అవసరం అవుతుందని, కొన్ని వేల వందల సంవత్సరాల క్రితం ఋషులు, మునులు ఆచరణ చేయడం ద్వారా ఆయుషును పెంచుకున్నారన్నారు... వారి ఆచరణలను ప్రధాన మంత్రి వర్యులు నరేంద్ర మోడీ గారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తీసుకొని ప్రతి ఒక్క మానవాళి జీవితా ఆరోగ్య ఆయుషును పెంపొందించడం కొరకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భారతదేశ సంస్కృతిని విశ్వప్రపంచానికి తీసుకెళుతున్న గొప్ప కార్యక్రమం యోగా కార్యక్రమం అన్నారు. యోగా చేయడం ద్వారా శరీరాన్ని, శ్వాసని, అవయవాలను, మనసును ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చునన్నారు..



ప్రజలందరూ యోగా కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని కోరుకుంటున్నాను అన్నారు.కార్యక్రమం అనంతరం ఆయుష్ డాక్టర్స్ ప్రసాద్, మునిస్వామి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, యోగా మాస్టర్స్ కు ఆదోని సబ్ కలెక్టర్ శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో మంత్రాలయం మఠం మేనేజర్ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, మంత్రాలయం టిడిపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, పర్యాటకశాఖ అధికారి విజయ, డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తుంది :అంబాల

## దోచుకొని దాచుకోవడమే టిడిపి నాయకుల నైజం.. తిరుపం రెడ్డి.

## చంద్రబాబు నమ్మకద్రోహాన్ని ప్రజలుగమనిస్తున్నారు.ఇలియాస్ ఖాన్.




**వెలుగోడు జూన్ 18 రిపబ్లిక్ న్యూస్** రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తుందని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో టిడిపి నాయకులు రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకుని దాచుకోవడానికి ఉన్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తిరుపం రెడ్డి అన్నారు. బుధవారం నాడు స్థానిక పార్టీ కార్యాలయంలో బాబు నమ్మకద్రోహం పై సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ నెంబర్ ఇలియాస్ ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సాధ్యం కానీ హామీలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అన్ని విధాలుగా చంద్రబాబు నాయుడు నమ్మక ద్రోహం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయక మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు చంద్రబాబు నాయుడు మోసగించారన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న పథకాలను కాపీ చేసి పేర్లు మార్చారే తప్ప. ఈ ప్రభుత్వంలో ఏ కొత్త పథకాలు తీసుకురాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ప్రజలకు మంచి పనులు అందించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్, మండల యూత్ ప్రెసిడెంట్ షంషీర్ అలీ ,ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఏసురత్నం, సుదర్శనం, గోవిందు, గోవర్ధన్ రెడ్డి ,మండల వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, మోత్కూర్ మాజీ సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి, తెలుగు రమణ ,జె వలి, కాటిపోగు రమేష్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

# విధినిర్వహణలో పోలీసుల అలసత్వం

## కేసు నీరు గార్చేందుకు ప్రయత్నం







**అనంతపురం ప్రతినిధి క్రైమ్ జూన్ 18 ( రిపబ్లిక్ న్యూస్) :**

శింగనమల నియోజకవర్గంలో ఎల్లనూరు మండలం చింతకాయ మంద గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సంఘాల లక్ష్మయ్యను అదే గ్రామానికి చెందిన అగ్రకులాలు దాడి చేసిన సంఘటన తెలిసిన విషయమే. అనంతపురం సర్వజన ఆసపత్రిలో బాధితుడు జరిగిన ఘటనను తెలియజేసిన మేరకు ఎమ్మెల్సీ కేసు నమోదు అయింది. అయితే దాడి జరిగింది గత శు క్రవారం అయితే తాడిపత్రికి పెద్దారెడ్డి వస్తున్న సందర్భంగా విధినిర్వహణలో అక్కడికి బందోబస్తు కారణంగా వెళ్ళామని ,ఎల్లనూరు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. స్టేషన్ లో ఫిర్యాదు ఇచ్చిన దానిని నేను మరిచిపోయానని, బాధితునికి చెప్పానని అయితే వేరే గ్రామంలో ఖైదీలను రిమాండ్ కు తరలించేందుకు వెళ్లాల్సి వచ్చిందని పొంతలనేని సమాధానాలతో కేసుని తప్పుదావ పట్టించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు ఇందులో భాగంగా యూనిఫామ్ లేకుండా సాధారణ దుస్తుల్లో హెడ్ కానిస్టేబుల్ రావడం వెనుక ఆంతర్యం ఏమి.సర్వజన ఆసుపత్రిలో బాధితున్ని విచారించి స్టేట్ మెంట్ తీసుకునే సమయంలోనే పదే పదే ఫోన్లు రావడంలో అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేసును తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతోనే పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు బాధితుడు ఇచ్చే వాంగ్మూలాన్ని యధావిధిగా రాయాల్సి ఉండగా పదే పదే బాధితున్ని అనవసర ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేయడం వెనక ఏదో మతలబు ఉందని అర్థమౌతోంది.

బాధితుడు ఇచ్చే వాంగ్మూలాన్ని ,ఇచ్చినట్టు రాస్తున్నట్లు ప్రవర్తిస్తూ,మధ్య మధ్యలో ఫోన్లో మాట్లాడుతూ ఇచ్చిన వాంగ్మూలాన్ని మరోసారి ఇవ్వమని, అడగడంతో ఈ కేసుని తప్పుదోవ పట్టించడానికి చేసిన ప్రయత్నాలకు బలం



చేకూరింది.బాధితున్ని తికమకపెట్టి, బాధితుడు ఇచ్చే వాంగ్మూలాన్ని వినకుండా, ఇది కాదు అది, అని అది ,కాదు ఇది అంటూ మాటల్లోకి నెట్టి బాధితున్ని భయపొట్టీ పెట్టనట్టుగానే భయపెట్టి బాధితున్ని విసిగించి, వేసారించి,,సతాయించి ఫిర్యాదు లో బాధితుడు ఇచ్చే వాంగ్మూలంలో తిరిగి కొంతమందిని ఇరికించే ప్రయత్నం చేయసాగారు.దీంతో ఇరికించిన వాళ్ళ మళ్లీ ఇదే ఎస్సీ సామాజిక వర్గం పై మరోసారి దాడికి ప్రయత్నించే దిశగా ఎల్లనూరు పోలీసులు ప్రవర్తించిన తీరు స్పష్టంగా అర్థమవుతోంది బాధితులు ఇచ్చే వాంగమూలాన్ని రికార్డ్ పరంగా రాస్తున్నట్లు ప్రవర్తిస్తూ బాధితిని వాంగ్మూలాన్ని తారుమాలు చేసి, మరోసారి గ్రామంలో గొడవలు సృష్టించేందుకు, అగ్రకులాలకు కొమ్ము కాసేందుకు ఇదంతా పోలీసులు విచారణలో భాగమే..దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా జిల్లాలోనే కాదు రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ మరింత అధ్వానంగా మారింది. డివిజన్ల పరిధిలో ఉన్న మండలాల పోలీస్ స్టేషన్ లలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాధితులు ఫిర్యాదు ఇస్తే, పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం దేవుడెరువు,, కనీసం ఏమి సమస్య,,ఎందుకొచ్చారు అని స్టేషన్ లలో మాట్లాడే నాధుడే కనపడరు. ఫ్యాక్షన్ గ్రామాలలో పెత్తందారులకు కాపుకాసే పోలీసులు దళిత సామాజిక వర్గానికి న్యాయం చేస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది..పోలీస్ స్టేషన్లు ప్రజా సమస్యలు పరిష్కారం కోసం



సమస్యలను విన్నవించుకోవడానికి పోలీస్ స్టేషన్లకు వచ్చిన బాధితుల్ని పోలీసులు పట్టించుకోరు, పోనీ బాధితుడు ఇచ్చే ఫిర్యాదు మేరకు కట్టాల్సిన ఎఫ్ఐఆర్ కట్టకుండా బాధితులను స్టేషన్ల చుట్టూ పలుమార్లు తిప్పుతూ ముప్పు తిప్పలు పెట్టి ముప్పై ఆరు చెరువుల నీళ్లు తాపుతున్నారు.. దీని వల్ల ప్రజలకు సమస్యలు అధికమవడంతో ఆ సమస్యల నుంచి బయటపడేందుకు ప్రత్యామ్నాయంగా ఒక మార్గాన్ని ప్రజలు ఎన్నుకుంటారు. ఆ మార్గమే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగే ' ప్రజా సమస్యల పరిష్కార వేదిక ' ద్వారా జిల్లా ఎస్పీ సమక్షంలో ముఖాముఖిగా ప్రజలు సమస్యలు జిల్లా ఎస్పీకి విన్నవించుకుంటారు. సమస్యలు విన్న జిల్లా ఎస్పీ ఐ పి ఎస్ ఆదేశాల మేరకు వివిధ కేసులను డివిజన్ల మండల పరిధిలోనీ సమస్యలను డీఎస్పీకి బదిలీ చేయడంతో ఈ కేసు విషయమై డి.ఎస్.పి సీరియస్ గా వార్నింగ్ ఇవ్వడంతో పోలీసులలో చలనం ఏర్పడి రీ అడ్మిషన్ లో ఉన్న బాధితుల్ని విచారణలో భాగంగా ఎల్లనూరు పోలీసులు మంగళవారం ఉదయం 10:32 గంటలకు సర్వజన ప్రభుత్వాసుపత్రికిరావడం జరిగింది. అందులో భాగంగా బాధితునితో ఫిర్యాదు తీసుకుని రికార్డ్ చేసుకున్నారు.

### అగ్రకులాల వారి పై కేసు కట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్

సంఘాల లక్ష్మయ్య వివరణ ఇస్తూ.. తనకు, తనకుటుంబానికి ప్రాణహాని ఉంది అని, మాకు మా కుటుంబంబానికి ఏది జరిగినా కూడా అగ్రకులాల వారిదే బాధ్యతన్నారు. అయితే బాధితునికి రక్షణ కల్పించి,అగ్రకులాల వారి పై పోలీసులు కేసులు కట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ డ్రెస్ లో పోలీసులు వచ్చి సర్వజన ఆసుపత్రికి వచ్చి ఎంక్వయిరీ చేయడంలో ఆంతర్యమేమి. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను డీఎస్పీ స్థాయిలో విచారణ జరగాల్సి ఉండగా కేవలం హెడ్ కానిస్టేబుల్ తోనే తూతూ మంత్రంగా విచారణ చేపట్టి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులు అగ్రవర్ణాలకే కొమ్ముకాస్తున్నారని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి.ఎస్సీ నియోజకవర్గంలోనే ఎస్సీలపై ఇలాంటి దాడులు జరగడం ,ఎస్సీలకు రక్షణ లేకపోవడం అనేక విమర్శలకు దారితీస్తోంది. ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయంపై నోరు విప్పకపోవడం. సర్వత్ర చర్చనీయాంసమైంది.

దళితులంటే వివక్ష, దళితులంటే నిర్మూలన, దళితులంటే వెలువేత, దళితులంటే గ్రామాల చివరన, దళితులంటే అంటరానివారు గా పరగనిస్తూ కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రజలను ప్రజాప్రతినిధులు వాడుకుంటారు. కేవలం ఎలక్షన్ లలో ఓట్లను దండుకొని ఆ తరువాత ప్రజల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న రాజకీయ నాయకులు ,అధికారులు, స్పందించి తక్షణం న్యాయం చేయకపోతే దళిత సంఘాలు ఏకమై ఉద్యమాలను ఉధృతం చేస్తామణి కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## సాంబత్తిన శివను చదివిస్తున్న విమలభాను ఫౌండేషన్ చైర్మన్ విమలభాను



**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)** జగ్గయ్యపేటలోని క్రిష్టియన్ పేటకు చెందిన సాంబత్తిన శివ అనే యువకుడు తనకు ఊహ తెలిసినప్పట్నుంచి సామినేని కుటుంబంలోనే పెరిగాడు. ఆ ఫ్యామిలీలోని అందరితో సఖ్యతగా మెలుగుతూ ఇప్పటికీ అక్కడే డ్రైవర్ గా పని చేస్తున్నాడు. అయితే ఇతనిని సామినేని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ విమలభాను తన ఫౌండేషన్ తరపున పదో తరగతి చదివించారు. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన శివను విమలభాను శాలువాతో సన్మానించి అభినందించారు. ఇంకా ఉన్నత చదువులకు సిద్ధపడాలని ఆమె సూచించారు. భవిష్యత్తులో మంచి స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు.

## వికసిత భారత్ కార్యక్రమం ఘనంగా





**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)** నందిగామ రురల్ కమ్మవారిపాలెం గ్రామంలో ఈ రోజు వికసిత భారత సంకల్ప సభ మండల ప్రధాన కార్యదర్శి నిడమానూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా -ఏపీ బిజెపి ఎస్సీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ బొడ్డు నాగలక్ష్మి ముఖ్య అతిథిగా నందిగామ అసెంబ్లీ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య పాల్గొన్నారుభారతీయ జనతా పార్టీ సభ్యులతో ముందుగా అందరితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం బొడ్డు నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి 11 సంవత్సరాల సేవ సుపరిపాలన పేద ప్రజల కోసం ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన అటువంటి పథకాలు ఈ దేశంలో చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. సీతారామయ్య అమ్మ పేరుతో మొక్కలు నాటడం మరియు 2047 నాటికి భారతదేశం ప్రథమ స్థానంలో ఉండటానికి మన కర్తవ్యాలు నిర్వర్తిస్తూ దేశానికి సహకరిస్తూ ఉండాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు కొంగర రమేష్ మునగంటి కామేశ్వరరావు ముక్కపాటి నరసింహారావు గ్రామ పార్టీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పల్లె పోగు సరోజిని కుటుంబ సభ్యులకు ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శ.



**ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**వీరులపాడు మండలం చౌటపల్లి గ్రామం నందు బుధవారం నాడు పల్లె పోగు సరోజిని పెద్దకర్మ కార్యక్రమమునకు కూటమి నేతలతో కలిసి హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# యోగా సాధన ఆర్థిక పురోగతికీ మార్గం

- ప్రజల ఆరోగ్యం బాగుంటే పొదుపు పెరుగుతుంది
- బ్యాంకర్లు యోగ సాధనను విస్తృతంగా ప్రచారం చేయాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ









**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)** యోగాసనాల సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంత మవుతుందని. ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యం బాగుంటే అది ఆర్థిక పురోగతికీ విలువైన మార్గమవుతుందని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడ బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, వాసవి ఇంటర్నేషనల్ క్లబ్స్ సభ్యులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం బాగుంటే వైద్య ఖర్చుల రూపంలో చేసే వ్యయం తగ్గటం వల్ల వారిలో డబ్బులు పొదుపు చేసే సంస్కృతి పెరుగుతుందని. అది వ్యక్తి శ్రేయస్సుకు, ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు. ఇదే వేదికపై కొన్ని రోజుల కిందట వైద్యులు కూడా యోగా సాధన చేశారని. వారి ప్రసంగాల్లో సైతం యోగాసనాలు ఆచరించడం ద్వారా అద్భుతమైన ఆరోగ్యం ప్రజలకు లభిస్తుందని తెలిపారన్నారు. యోగ సాధన విశిష్టతపై బ్యాంకర్లు తమ ఖాతాదారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. జీవితంలో ఏం సాధించాలన్నా ఆరోగ్యంగా ఉండటం ముఖ్యమని. ప్రతిఒక్కరూ తమ రోజువారి జీవితంలో యోగ సాధనకు కొంత సమయం కేటాయించాలన్నారు.

యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగసమైనందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ సూచన మేరకు బ్యాంకు శాఖలను సందర్శించే ప్రతి ఖాతాదారునికి యోగాసనాల విశిష్టతను తెలియజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంగా జీవించడం కంటే మించిన సంపద లేదన్న విషయాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకున్న రోజున యోగా సాధన ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతుందన్నారు. ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ పూర్వపు అధ్యక్షులు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక, వారసత్వ సంపద అయిన యోగా సాధనను ప్రపంచానికి చేరువచేయడంలో గౌరవ ప్రధాని విజయవంత మయ్యారని. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్ నేతృత్వంలో ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. భారతదేశ జీవన విధానంలో ఒకనాడు యోగాసనాలు చాలా ప్రాముఖ్యత కలిగి ఉండేవన్నారు. భారతీయ సమాజంలో తిరిగి అటువంటి సంస్కృతి నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌బీసీ సీఎం గౌతమ్ లక్ష్మీనారాయణ, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాస్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్, ఏపీజీబీ ఆర్ఎం ప్రసాద్, కేడీసీసీ జీఎం రంగబాబు, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం,రైతుల ప్రభుత్వం.

### గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయి,

### ఎక్కడ కూడా సబ్సిడీలు, వ్యవసాయ ఉపకరణ యంత్రాలు ఇచ్చిన దాఖలాలు లేవు.







**ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)** కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్ లక్ష్మీ షా, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, వేల్పుల సునీత గ్రామ సర్పంచ్ మరియు కూటమి నేతలతో కలిసి వ్యవసాయ ఉపకరణ యంత్రాలను ప్రారంభించిన ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ. జిల్లా కార్యక్రమం కంచికచర్లలో జరగటం కలెక్టర్ విచ్చేయడం చాలా సంతోషం. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే సంవత్సర కాలంలోనే అన్ని వ్యవస్థలను ఒక తాటిపై తీసుకు వస్తున్న ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా మణులు తల్లికి వందనం నగదు తల్లుల ఖాతాకు జమ కావడంతో చాలా సంతోషంగా ఉన్నారు. చెప్పిన హామీను నెరవేర్చినందుకు రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కి ధన్యవాదాలు, ఈ రోజు నుంచి వ్యవసాయ యంత్రాంగాలు సబ్సిడీలు మరల పునరుద్ధరించడంతో రైతన్నలు కూడా సంతోషంగా ఉండబోతున్నారు. సూపర్ సిక్స్ హామీల లో భాగంగా ఈ నెల చివరిలోపు రైతు భరోసా కూడా నెరవేరనుంది. నందిగామలో 67 లక్షల రూపాయల విలువ కలిగిన 126 పరికరాలను 38 లక్షల రూపాయల సబ్సిడీతో రైతన్నలకు అందజేయడం జరిగినది. ఇందులో రోటవేటర్స్, కల్టివేటర్స్ ఆధునిక వ్యవసాయం చేయడానికి అధునాతనంగా డ్రోన్స్ అందజేయడం జరిగినది. దీని ద్వారా స్ప్రే చేసే విధానం దృశ్య రూపంలో రైతన్నలకు చూపించడం జరిగినది. రానున్న రోజులలో వ్యవసాయ క్షేత్రంలో అధునాతన మార్పులు జరిగి అతి తక్కువ సమయంలో ఎక్కువ లబ్ధి చేకూరే విధంగా రైతన్నలకు భరోసాగా కూటమి ప్రభుత్వం చేసే ప్రణాళికలు ఉండబోతున్నాయి దీని ద్వారా రైతన్నలకు లబ్ధి చేకూరనున్నదని ఈ సందర్భంగా తెలియజేశారు.

# రాయితీ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ

### రాయితీతో వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేత -జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ







**అనంతపురం, జూన్ 18 ( రిపబ్లిక్ న్యూస్ ) :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని, రాయితీతో అందజేసిన వ్యవసాయ యంత్ర పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ కింద వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీతో పంపిణీ చేసే కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే జిల్లా రైతులపై ఉన్న అభిమానంతో హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని, దాదాపు 3 వేల కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్లడం జరుగుతోందన్నారు. గత ఐదేళ్లలో రైతులకు సంబంధించిన పనిముట్లు, డ్రిప్ ఇరిగేషన్, సౌకర్యాలను అందించలేదన్నారు. రైతులు సంతోషంగా ఉండాలనే ఆలోచనతో, వారి సంక్షేమమే లక్ష్యంగా రాయితీతో 1,070 మంది రైతులకు వ్యవసాయ యంత్ర పనిముట్లను అందిస్తున్నామన్నారు. తొలకరి జల్లులు పడగానే రైతన్నల బ్యాంక్ అకౌంట్లలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం కింద 20 వేల రూపాయలను వేస్తామని మాట ఇవ్వడం జరిగిందని, దానిని ఈ నెలాఖరులోగా అమలు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 18 గంటల పాటు పనిచేస్తూ రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలని, భారతదేశంలో మొదటి స్థానంలో నిలపాలని పని చేస్తున్నారన్నారు. కరువుకాటకాలతో ఉన్న అనంతపురం జిల్లాని సస్యశ్యామలం చేసుకోవాలని, రైతులంతా ధైర్యంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులను గుర్తించి సమిష్టిగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని వారి కష్టసుఖాలు పంచుకోవాలని, సమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తే సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. రాయితీతో అందజేస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ కింద రాయితీతో అందజేస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యక్తిగతంగా 50 శాతం రాయితీపై వివిధ వ్యవసాయ పనుల కోసం పనిముట్లను సరఫరా చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 1,070 మంది రైతులకు 50 శాతం రాయితీతో రూ. 2.29 కోట్ల రాయితీ నిధులు వినియోగించడం జరిగిందన్నారు. రైతుల సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రూ. 2.29 కోట్ల మెగా చెక్కను రైతులకు ఎంపీ, జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్, ఆగ్రోస్ డిఎం ఓబుళపతి, మండల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నందిగామ మున్సిపాలిటీ మెప్మా టౌన్ లెవెల్ ఫెడరేషన్ సెక్రటరీ యర్రగాని కోటేశ్వరమ్మ కి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శ



**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**చందమామ పేట నందు బుధవారం నాడు ఇటీవల కాలంలో మోకాళ్ళ శాస్త్రచికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకొనుచున్న నందిగామ మున్సిపాలిటీ మెప్మా టౌన్ లెవెల్ ఫెడరేషన్ సెక్రటరీ యర్రగాని కోటేశ్వరమ్మ ని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్న ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య. కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి మరియు తెదేపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ మరియు కృష్ణ జిల్లా డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 6,7,8,9 వ తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**
కృష్ణ మరియు ఎన్టీఆర్ జిల్లా డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 వ తరగతుల్లో మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. రేపటి నుంచి ఆయా పాఠశాలల్లో ఈ ధరఖాస్తులు స్వీకరిస్తారు. ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు (25 జూన్ 2025 ) పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రం మరల తెలియపరిచేదం అని, ఎస్సి, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి, అని జిల్లా సమన్వయ అధికారి ఒక ప్రకటనలో తెలియజేసారు.

## గంధ్రాజుకుప్పం పరిసర ప్రాంత గ్రామస్థులకి ఇబ్బందిగా మారిన

# అక్రమ గ్రావెల్ క్వారీలను రద్దు చేయాలి

**:"సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు డిమాండ్".**





**నగరి రూరల్ 18 జూన్ ( రిపబ్లిక్ న్యూస్ ):**
ఈ రోజు చిత్తూర్ జిల్లా నగరి రూరల్ మండలం,గుండ్రాజు కుప్పం దళితవాడ ప్రజలు చెత్త ఎన్నుకోబడిన గ్రామ కమిటీ నాయకులు, ' నేతాజీ రాజ్ కోటి అధ్యక్షతన, చిత్తూర్ జిల్లా సి. పి. ఐ పార్టీ శ్రేణుల సహకారం తో నగరి మండల తాలూకా కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమాని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామనాయుడు మరియు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఐ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్యా పాల్గొనిముందుండి నడిపిచ్చారు, గుండ్రాజు కుప్పం దళితవాడ అనుకొని ఉన్న కొండను గ్రావెల్ క్వారీకి అనుమతి ఇచ్చే ముందు ఆ కొండకు దగ్గరలో ఉన్న గ్రామ ప్రజలతో సభలు జరిపి అక్కడ ప్రజల యొక్క అభిప్రాయం సేకరించి దానికి అనుకూలంగా రెవెన్యూ అధికారులు ఎన్వోసీ ఇవ్వవలసి ఉంటుంది, కానీ ఆ పద్ధతిని పాటించకుండా గ్రామ సభలు జరుపకుండా, గ్రావెల్ అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ పార్టీ శ్రేణులంతా నినదించారు , 'రెవెన్యూ అధికారులు ఎన్వోసీ ఇచ్చే ముందు గ్రామ సమస్యల పై గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించి తరువాత గ్రామస్తుల యొక్క ఇబ్బందులను వారి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా అధ్యయనం చేసిణ పిమ్మట క్వారీలకు అనుమతివ్వాల్సి ఉంది, ప్రస్తుతం క్వారీ జరుగు కొండ ద్వారా పక్కనున్న మూడు చెరువులకు అందే నీటిని వ్యవసాయ భూములకు,తాగునీటికి ,మరియు మేకలు, ఆవులు, బర్రెలు,గొర్రెలు మేతకు ఇబ్బంది లేకుండా ఉప్పయోగిస్తూ జీవిస్తున్నారు, ఇప్పుడు పూర్తిగా క్వారీలకు అనుమతి ఇచ్చినందువలన ఆ పరిస్థితి పూర్తిగా వెతిరేకమైంది, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో సభ జరిపించి ప్రజల అభిప్రాయాల్ని పరిగణలోకి తీసుకున్నాక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికె గ్రావెల్ క్వారీలో ప్రభుత్వ పనులకు ఇచ్చే పరిమితికి మించి గ్రావెల్ తరలిం చడం జరుగుతున్నందున పరీమతులకు మించి గ్రావెల్ తవ్వకాలు చేపట్టే కార్యక్రమంలో భాగంగా తమ ఇష్టానుసారంగా బాంబ్ బ్లాస్టింగ్ చేయడం తో గుండ్రాజుకుప్పం దళితవాడలోని ఇల్లలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, కొండని ఆనుకుని ఉన్న పచ్చని పొలాల్లో మేస్తున్న పాడి పశువులు బాంబ్ బ్లాస్టింగ్ మరియు మిషనరీ శబ్దాలకు భయభ్రాంతులకు గురవుతున్నాయని, రాత్రిపూట కూడా భారీ మెషిన్ తో తవ్వకాలు చేపట్టడంతో చిన్న పిల్లలు,వృద్దులు,వ్యాధిగ్రస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు,ఇలా రాజకీయ నాయకులు మరియు అధికారుల అండదండలతో అక్రమంగా వారి నడుపుతున్న యజమానులు తక్షణమే ఆపేయాలని కోరారు. రెవెన్యూ మరియు మైనింగ్ అధికారులు కూడా గ్రామ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.
అనంతరం నగరి ఎమ్మార్వో గారికి వినతిపత్రం ఇచ్చి గ్రామ సభ జరపాలని ప్రజల అభిప్రాయ సేకరణ జరిపిన తర్వాత కోరి కార్య పనులు జరపాలని కోరాము. అనంతరం ఎమ్మార్వో గారు పై అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో రెవెన్యూ డిపార్ట్మెంట్ మైనింగ్ డిపార్ట్మెంట్ మరియు పోలీసులు కంట్రోల్ బోర్డు వాళ్ళతో కలిపి గ్రామ సభలు నిర్వహించి ప్రజాప్రాయన సేకరణ చేపడుతామని హామీ ఇచ్చిన అనంతరం ఆందోళన విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామనాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య,నగరి పట్టణ నాయకులు సుబ్రహ్మణ్యం మధు బాబు,గ్రామ కమిటీ నాయకులు రజినీ సందీప్ ఉమాపతి మాశిలామని భాస్కర్ ప్రేమరాజు వకీల్ శేఖర్ రామమూర్తి నటరాజన్ విజయ్ భారతి రాణి లత సంధ్య ప్రీతి అభినయ అంజలి యువజన సంఘం నాయకులు వేణుగోపాల్, నేతాజీ,దిలీప్, ఏ.జీ.ప్రశాంత్, నరేష్,సురేష్, కుమరేశ్, రాజకోటి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో అతిపెద్ద సాయిబాబా విగ్రహం



**బనగానపల్లె జూన్ 18 రిపబ్లిక్ న్యూస్**
ప్రపంచంలోనే అతిపెద్ద షిరిడి సాయిబాబా విగ్రహం నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఉంది.అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ఆంధ్ర తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 385 ఆశ్రమాలు స్థాపించబడినది. అందులో బనగానపల్లె నుండి యాగంటి వెళ్లే దారిలో ఉన్న ఆశ్రమం కూడా ఒకటి. ఇక్కడ ప్రతిరోజు బాబా వారికి నాలుగో హారతులు ఇవ్వడం జరుగుతుంది...ప్రతి గురువారం భక్తుల కొరకు అన్నదాన కార్యక్రమం కూడా జరుగుతుందని ఆశ్రమ సిబ్బంది వెల్లడించార. ఈ ఆశ్రమం నందు భక్తులకు ఆకర్షించే విధంగా 124 అడుగుల ఎత్తు గల సద్గురు సాయి బాబా గారి విగ్రహం నిర్మించబడింది ఈ విగ్రహము ప్రపంచంలోని సాయిబాబా విగ్రహాల్లో అన్నిటికన్నా ఎత్తయిందని సాయిబాబా భక్తులు వెల్లడించారు. ఈ ఆశ్రమానికి సమీపంలో ఉన్న యాగంటి క్షేత్రమునకు వెళ్లే ప్రతి భక్తుడు ఈ ఆశ్రమంలోని 124 అడుగుల సద్గురు సాయి దివ్యమూర్తిని దర్శనం చేసుకుని వెళ్తారు. ప్రతిరోజు సుమారుగా 200 మంది భక్తులు వచ్చి సద్గురు సాయిని వారి ఆశీస్సులు పొందుతున్నట్లు వారు వెల్లడించారు.

## వైసిపి రాష్ట్ర ఎస్టి విభాగ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస నాయక్

**కోయిలకుంట్ల జూన్ 18 రిపబ్లిక్ న్యూస్**
కోయిలకుంట్ల పట్టణానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ నాయకుడు శ్రీనివాస నాయక్ ను వైఎస్ఆర్ పార్టీ ఎన్నికైన సందర్భంగా వైయస్సార్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఈ పదవి రావడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తన మీద నమ్మకంతో తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని శ్రీనివాస నాయక్ తెలిపారు.



## కుప్పంలో బాధిత మహిళకు రూపాయలు ఐదు లక్షలు చెక్కును అందజేసిన. ఆర్టీసీ చైర్మన్ మునిరత్నం.



**కుప్పం (రిపబ్లిక్ న్యూస్) జూన్ 18**
కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ పురానికి చెందిన శిరీష కుటుంబానికి సీఎం చంద్రబాబు ఫోన్ లో మాట్లాడి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ మేరకు ఆమెకు రూపాయలు 5 లక్షల చెక్కును ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కడ పీడి వికాస్ మర్మత్, డాక్టర్ సురేష్ బాబు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 50 సెంట్ల భూమి కేటాయించినట్లు పిడి తెలిపారు.బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో పోలీస్ రక్షణ కల్పించడంతోపాటు ఆమె పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వ చూసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు రాజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు?

## కుప్పంలో రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న దాడులు మరియు దౌర్జన్యాలు



**కుప్పం (రిపబ్లిక్ న్యూస్) జూన్ 18**
కుప్పంలో ఇంకా మారని వైసీపీ నేతలు తీరు కుప్పంలో రెచ్చిపోతున్న వైసీపీ అల్లరిమూకలు.అంగన్వాడీ కార్యకర్త పై దౌర్జన్యానికి పాల్పడిన వైసీపీ కో ఆప్షన్ మెంబర్ అక్తర్. మహిళలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన అక్తర్,అతని తమ్ముడు అంజద్
తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్వాడీ కార్యకర్త నజియా బేగం కుప్పం మండలంలో వైసీపీ శ్రేణుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అధికారంలో ఉన్నపుడు చేసిన అరాచకాలను అలాగే కొనసాగిస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారు తాజాగా కుప్పం మండలం రాగిమనుమిట్ట గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త గా నజియా బేగం గత 15 సంవత్సరాలుగా పనిచేస్తోంది.అయితే అదే గ్రామానికి చెందిన వైసీపీ కో ఆప్షన్ సభ్యుడు అక్తర్ తరచూ వేధిస్తుండేవాడని భాదితులకు బోరున విలపించింది.గతంలో తరచూ తనను బలాత్కారం చేసేందుకు ప్రయత్నించాడని అన్ని భరించిన అతనిఆగడాలుమితిమీరిపోయాయని తన ఆవేదన వ్యక్తం చేసింది.అయితే ఈ రోజు తాను గ్రామం లో ఉన్న సమయంలో తనను కావాలనే నీటి కోసం వేచి ఉన్న సమయంలో గొడవ కు దిగాడని ,వచ్చిన వెంటనే నీ అంతు చూస్తానని హెచ్చరించడం కాకుండా కత్తులతో దాడి చేసినట్టు భాదితురాలు తెలిపింది.అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను తన భర్త ఆసుపత్రికి తరలించారు.కాగా టీడీపీ సానుభూతి పరురాలు వైసీపీ నాయకుని దాడిలో గాయపడిన విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు భారీ సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుని భాదితురాలిని పరామర్శించారు.టీడీపీ నాయకులు మాట్లాడుతూ కుప్పంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఇంకా అధికారంలో ఉన్నట్టు విచ్చలవిడిగా ప్రజలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు.ఈ ఘటనపై వెంటనే పోలీసులు చర్యలు తీసుకొని మహిళలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి అని డిమాండ్ చేశారు.

# ద్విచక్ర వాహనాల దొంగఅరెస్టు

**రూ. 35 లక్షల విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం. .. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)**
35 లక్షల విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలు దొంగలించిన నిందితున్ని గోనెగండ్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సంధర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో నిందితుని వివరాలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మీడియా సమావేశంలో వెల్లడించారు.
ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...కర్నూలు, ఎమ్మిగనూరు , గోనెగండ్ల ప్రాంతాలలో బైక్ లు దొంగలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి ముద్దాయిని పట్టుకోవడాని చర్యలు చేపట్టామన్నారు. ఈ రోజు గోనెగండ్ల మండలం కు చెందిన కుర్వ వెంకటేష్ నుండి 30 బైక్ లు రికవరీ చేయడం జరిగిందన్నారు. కర్నూలు ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ , కోడుమూరు , ఓర్వకల్లు తదితర ప్రాంతాలలో 30 ద్విచక్ర వాహనాలను దొంగలించినట్లుకురువ వెంకటేష్, వయస్సు:20 సంవత్సరాలు, తండ్రి పేరు:కురువ బజారీ, పెద్దమర్రివీడు గ్రామం, గోనెగండ్ల మండలం. కర్నూల్ జిల్లా. నిందితుని నుండి స్వాధీనం చేసుకొన్నవి....రూ. 35 లక్షల విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ఎస్ డి ఓ పి ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో గోనెగండ్ల సిఐ. ఓ. విజయ భాస్కర్ మరియు సిబ్బంది బృందంగా ఏర్పడి గోనెగండ్ల పోలీసు స్టేషన్ పరిధిలో ముద్దాయిని ఈ రోజు ఉదయం 6 గంటల కు రాబడిన సమాచారం మేరకు గోనెగండ్ల గ్రామం ఊరి బయట పెద్దమర్రివీడు గ్రామం రోడ్డు లో గల సుంకులమ్మ గుడి వద్ద ద్విచక్ర వాహనాలు



దొంగిలించిన ముద్దాయిని అరెస్ట్ చేశారు. నిందితుడు కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఇతనికి మద్యం, తదితర చెడు అలవాట్లు ఉండటంతో కూలి పనుల నుండి వచ్చే ఆదాయం ఖర్చులకు మరియు కుటుంబ పోషణ కు సరిపోయేది కాదు. ఎలాగైనా సులువుగా డబ్బులు సంపదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మోటార్ బైక్ లను దొంగిలించడము చాల సులభమని చెప్పుకోచ్చాడు. బస్టాండ్లు మరియు ఇళ్ల ముందర పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను టార్గెట్ చేసుకున్నాడు. నకిలీ తాళాల సహాయంతో ద్విచక్ర వాహనాలను అపహరించడం మొదలు పెట్టాడు. వీటన్నింటినీ గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామంలో తన పాత ఇంటిలో దాచిపెట్టాడు. చోరి చేసిన బైక్ లను జొన్నగిరి ప్రాంతాలలో పొలాల పనులు చేసుకునే రైతులకు అమ్మివేశాడన్నారు. పొలలాకు వెళ్లే రైతులకు రూ. 4 వేలు, 5 వేలకు ఇద్దరి కి అమ్మివేశాడన్నారు. పార్కింగ్ చేసిన వాహనాలను అప్పటికప్పుడు దొంగలించడం, వెంటనే అమ్మి వేయడం చేసేవాడన్నారు. పోలీసుల తనిఖీల్లో దొంగలించిన వాహనాలు బయట పడ్డాయన్నారు. మరో ఇద్దరు బైక్ నిందితులు ఉన్నట్లు తెలిసింది, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారునగదు రివార్డులతో అభినందించిన ... జిల్లా ఎస్పీ.ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన గోనెగండ్ల సి.ఐ %ూ%. విజయ భాస్కర్ మరియు %ఎజ%'%ం, చీ%. తేజేశ్వర కుమార్, %ఖ%. దేవరాజు %ూజ%'%ం`%.రాజు, %ఖ%.లక్ష్మీకాంత్, %జు%. వీరేష్ గౌడ్, %వీ%. బ్రహ్మయ్య , %+%. శ్రీనివాసులు, %ూ%. రమేష్ లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ నగదు రివార్డులు అందజేసి అభినందించారు
ఆ బైక్ చాస్ నెంబర్ ద్వారా బైక్ లకు సంబంధించిన ఓనర్లకు బైక్ లు అప్పగిస్తామన్నారు. మరిన్ని బైక్ లను కూడా రికవరి చేస్తామన్నారు. 28 బీట్స్ ను అన్నింటిని ఈ - బీట్స్ గా చేశామన్నారు. గస్తీలు పెంచి పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో మూడు న్నర నెలల్లోనే దాదాపు 5 వేల సిసిటివి కెమెరాలను ప్రజల సహాకారంతో ఏర్పాటు చేశామన్నారు. ఆ సిసి కెమెరాల సహాయంతో ఈ కేసును సులువుగా చేధించడానికి వీలయిందన్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలలో కూడా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) మరియు %ఫూ% నిధులు, మున్సిపల్ నిధులతో మరిన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.ఎక్కడైనా వాట్సాప్, టెలి గ్రాం గ్రూపులలో (ఏపీకె )ఫైల్స్ వస్తే వాటిని క్లిక్ చేయకూడదు, ఒపెన్ చేయకూడదన్నారు. మీడియా వారు కూడా సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన చేయాలన్నారు

## పిఠాపురం మునిసిపాలిటీ కార్యాలయంలో పట్టణ నిర్మూలన

**కాకినాడ జిల్లా ప్రతినిధి జూన్ 18,( రిపబ్లిక్ న్యూస్)**
పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పిఠాపురం పట్టణ మెప్మ సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబులు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు ఆధ్వర్యంలో పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు విచ్చేసి ట్యాబులు మరియు బయోమెట్రిక్ మిషిన్స్ అందజేస్తారు.
ఈ సందర్భంగా మర్రెడ్డి శ్రీనివాస్రావు మాట్లాడుతూ పిఠాపురం పట్టణ మెప్మా డిపార్ట్మెంట్ వారికి ఆర్.పిలకు 39 ట్యాబులు,డిజీ లక్ష్మీలకు 38 బయోమెట్రిక్ మిషన్స్



అందివ్వడం జరిగిందని అన్నారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు మాట్లాడుతూ మెప్మా డిపార్ట్మెంట్ సారధ్యంలో పేదరిక నిర్మూలన కోసం మెప్మా వారికి ఈ ట్యాబులను వినియోగించి మరింత పేదవారికి పథకాలు చేరే విధంగా ఇది ఉపయోగపడుతుందని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ ద్వారా పనులను మరింత సులభతరం చేసే విధంగా ఈ ట్యాబులు మరియు బయోమెట్రిక్ మెషిన్స్ బాగా ఉపయోగపడతాయని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఈస్ట్రన్ గోదావరి డెల్టా చైర్మన్ మొరాలశెట్టి సునీల్,చెల్లుబోయిన సతీష్,చల్లా లక్ష్మి, సి ఎం ఎం కె.వెంకట లక్ష్మి, సిఓస్ ఎండి ఉమే సల్మా, ఎడియం. శైలజ, ఆర్పిలు, యస్ ఎల్ ఎఫ్ అర్పిలు, డిజీ లక్ష్మిలు వీర మహిళలు జనసేన జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటిగ్రేటెడ్ భూమిలో రైతులకు ప్రత్యామ్నాయంగా భూమినీ

# రైతులకు చూపించిన డిపార్ట్మెంట్ అధికారులు, డిసిసి ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 19రిపబ్లిక్ న్యూస్**



నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలం ఎనికేమురి వాసర్ గ్రామం శివర్ లో ఇంటిగ్రెటెడ్ స్కూల్ మంజూరు అయినా శివారులో భూమి సర్వే పూర్తి చెసి డిపార్ట్మెంట్ అధికారులకు అందజేసి సాయిల్ టెస్ట్ స్టార్ట్ చేసిన అధికారులు. పాల్గొన్న డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి. ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైన భూమి సర్వే పూర్తిచేసుకుని విద్యాశాఖ డిపార్ట్మెంట్ అధికారులకు అందజేయడం జరిగింది. అలాగే డిపార్ట్మెంట్ అధికారులు సాయులు టెస్ట్ స్టార్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ భూమిలో రైతులకు ప్రత్యామ్నాయంగా భూమినీ రైతులకు చూపించిన డిపార్ట్మెంట్ అధికారులు. రైతులతో కలిసి పాల్గొన్న డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి . వారితో పాటు శివాజీ పాటిల్,బాల్ రెడ్డి,గంగాధర్ మాస్టర్ ,రాజు పటేల్ వెంకటరెడ్డి,ప్రకాష్ రావు,శంకర్ మాజీ సర్పంచ్ ,సంజీవ్.గంగాధర్ మాస్టర్,బాబు ,హన్మంత్ తదితరులు గ్రామ నేతలు రైతు లు పాల్గొన్నారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందించిన

# జిఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 19రిపబ్లిక్ న్యూస్**



నారాయణఖేడ్ మండలం సంజీవన్ రావుపెట్ గ్రామానికి చెందిన ఉప్పరి చిన్న సాయిలు కుమార్తె ప్రియాంక అనారోగ్యంతో మరణించిన విషయం జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుల్లపు మచ్చేందర్ దృష్టికి తీసుకుపోగా స్పందించి అంతక్రియలకు కొంత ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది ఇందులో కృష్ణపూర్ తాజా మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, కృష్ణాపూర్ తాజా మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, దమర్గిద్ద తాజా మాజీ సర్పంచ్ శంకర్ సాగర్,ప్రముఖ జర్నలిస్ట్ పండరి సాగర్, బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు గునుకుల సాయిరెడ్డి,నాగరం అంజయ్య సాగర్, జిఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ సాగర్,అభి పవర్,ఆంజనేయులు,జ్ఞానేశ్వర్ సాగర్,నర్సింలు సాగర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు

# బివిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ

### గిరిజన విద్యార్థుల ఆనందం మరువలేనిది -బివిజి ఫౌండేషన్ చైర్పర్సన్ సునీత సంపత్

**వికారాబాద్ జిల్లా జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు బివిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్ పర్సన్ ఉచితంగా షూస్ లను పంపిణీ చేసారు. బుధవారం పెద్దేమూల్ మండలంలోని పలు గిరిజన తాండాలలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బివిజి ఫౌండేషన్ చైర్ పర్సన్ సునీత సంపత్ , ఫౌండేషన్ సభ్యులతో కలిసి షూస్ సాక్సులు పంపిణీ చేశారు . ముఖ్యంగా మండలంలోని గిరిజన తండాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న సుమారు 350 మంది గిరిజన విద్యార్థులకు ఈ షూ అందజేశారు. ఈ సందర్భంగా బీవీజీ ఫౌండేషన్ చైర్పర్సన్ సునీత సంపత్ మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ



పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ షూస్ లను అందజేయడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. చిన్నారులు షూ లను చూసి వారు వేసుకునే విధానం ,వారి ఆనందం ఎన్ని కోట్ల సంపద ఇచ్చినా కూడా మరువలేనేదని అన్నారు. ఎంత చిన్న వయసులో విద్యార్థులు షూ పట్ల ఉన్న



వారి మక్కువ మేము తీర్చడం కూడా మాకు ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమానికి తోడ్పడిన మా ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డే శ్రీనివాస్ లాల్, గయాస్, రామ్ శెట్టి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు

# ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 17 ( రిపబ్లిక్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదోడికి సొంత ఇంటి కల నెరవేరాలని సంకల్పంతో ప్రవేశపెట్టిన "ఇందిరమ్మ ఇండ్లు" పథకంలో భాగంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక - జితేందర్ రెడ్డి ల సూచనల తో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసి, కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి




దొమ్మాటి విజయ్ కుమార్, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మిక సిబ్బంది తో పాటు కాంగ్రెస్ పార్టీ అంబారిపేట గ్రామ శాఖ అధ్యక్షుడు బోరకుంట రాజయ్య, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల కొమురయ్య యాదవ్,నాయకులు ఎలుక నాగ పెల్లి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



### మహిళలు,దళిత,గిరిజనులకు

# న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తాం

### ప్రజా సంఘాల నాయకులు

**అనంతపురం అర్బన్ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**

మహిళలపై అత్యాచారాలు,,హత్యలను ఖండిస్తూ స్థానిక సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ దగ్గర విద్యార్థి - ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించారు. ఈ ర్యాలి, మహా ధర్నాకు ప్రజా సంఘాల నాయకుల, విద్యార్థి, యువజన, మహిళలు,నాయకులు రాష్ట్రంలో దళిత, మైనర్ బాలికల మీద జరిగిన అత్యాచార, హత్య ఘటనలో, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో మహిళలు, దళిత, గిరిజనుల మీద జరుగుతున్న దాడులను హత్యలను ఖండిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ మహాధర్నాను నిర్వహించానన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివ నారాయన్ శర్మకి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకి వినతి పత్రం అందజేశారు. వివిధ సమస్యలను అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని సమస్యను పరిష్కరిస్తూ నిందితులను కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు డిమాండ్స్ : దాడులకు, అత్యాచారాలకు, హత్యలకు కారుకులైన నిందితుల ను కఠినంగా శిక్షించాలి. అత్యాచారాలకు కారణమవుతున్న అశ్లీల చిత్రాలు,నెట్ కంటెంట్లను, పాశ్చాత్య విష




సంస్కృతిని వెంటనే నిషేధించాలి.ప్రభుత్వం వెంటనే మద్యం నిషేధాన్ని ప్రకటించి అమలు చేయాలి.బాధిత కుటుంబాలకు తక్షణ సహాయార్థం ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి.బాధ్యత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.ప్రభుత్వం వెంటనే వారికి పది ఎకరాల వ్యవసాయ సాగు భూమిని కేటాయించాలి.ఇంటి స్థలం పక్కా గృహం మంజూరు చేయాలి.పై డిమాండ్లను ప్రభుత్వం వెంటనే చేయాలని మహిళలకు రక్షణ కల్పించాలని విద్యార్థి - ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సాకే హరి, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు మొండి వెంకటేష్, సామాజిక న్యాయ వేదిక జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, పౌరస హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, ప్రజా కళామండలి నాయకులు





విజయ్, బీసీ యువసేన నాయకులు చంద్రచర్ల హరి, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, సహాయ కార్యదర్శి పీ. కిష్ట పట్టణ పేదల సంఘం నగర అధ్యక్షుడు వీరనారప్ప.,ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వ్యవస్థాపక అధ్యక్షులు కొడవండ్ల నరేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నకేశవులు, పి ఎన్ ఐ వి రాష్ట్ర అధ్యక్షులు టీ.బి.రామన్న. హరి,పి డి ఎస్ యు జిల్లా కోశాధికారి బండారు శంకర్, ఉదయ్, నాయకులు తేజ , దావీదు , కుమార్ నాగరాజు సాంబ రఘునాథ్ రెడ్డి, జిలాన్, సత్తార్ , ఓబులమ్మ, దాదు బి , నాగరత్నమ్మ వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పట్టణ అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం

### - ఎమ్మెల్యే ఎం.ఎస్ . రాజు

**శ్రీ సత్యసాయి,మడకశిర జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**



పట్టణం అభివృద్ధి సమస్యల రహిత లక్ష్యంగా పనిచేయాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ కు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆదేశించారు. పట్టణంలోని 4, 17వ వార్డుల్లో టీ టైమ్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యే స్థానికులను ఆరా తీశారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను, అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలో కాలినడకన తిరుగుతూ, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ పర్యటించారు. కూరగాయల మార్కెట్ ను సందర్శించిన వ్యాపారస్తులతో కాసేపు ముచ్చటించారు. వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కమిషనర్ ను కోరారు. తల్లికివందనం, పెన్షన్, రేషన్ వంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై పట్టణ ప్రజలు చెప్పిన అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జ్యోతీరావుపూలే సర్కిల్ వద్ద డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపించారు. తమవద్దకు నేరుగా వచ్చి సమస్యలు తెలుసుకోవడం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరాతీయడంపై మడకశిర పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# విప్లవోద్యమంలో నేలరాలిన ధ్రువతార

**అనంతపురం, పెద్దవడుగూరు జూన్ 18 ( రిపబ్లిక్ న్యూస్ )**



మండల సిపిఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కామ్రేడ్ రామిరెడ్డి అనారోగ్య కారణాలతో మరణించారు. ఇది తెలుసుకున్న బంధువులు పార్టీ శ్రేణులు ప్రజలు పాల్గొని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా పాలెం నారాయణ స్వామి, కేశవరెడ్డి నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ రామి రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులై 1976. సంవత్సరంలో పార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీలో చేరారన్నారు. అప్పటినుంచి పార్టీ చేపట్టే కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ మండలంలో గ్రామాల్లో కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ నిత్యం ప్రజా సమస్యలు. రైతాంగ ,కార్మిక కూలీల సమస్యల పైన అనేక పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో ప్రజల మన్న లను పొందారు. 1995 సంవత్సరంలో సర్పంచ్ ఎన్నికలలో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా ఏ పార్టీతో పొత్తు లేకుండా ప్రజాబలంతో పోటీ చేసి ఘన విజయం సాధించి విప్లవోద్యమంలో ఓ ధ్రువతార నేలరాలింది.

అనంతరం 1995 సంవత్సరం నుండీ 2000 సంవత్సరం. వరకు సర్పంచ్ గా పని చేస్తూ గ్రామ అభివృద్ధికి నిజాయితీ. నిబద్ధతతో పనిచేస్తూ గ్రామపంచాయతీ ప్రజలు మన్నలను పొందారన్నారు .మండలంలోని పెత్తందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో పెత్తందారుల కుట్ర కేసులో భాగంగా ఏడు సంవత్సరముల జైలు జీవితం కూడా గడిపారనీ గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ గత రాత్రి ఎనిమిది గంటల సమయంలో తుది శ్వాస వదిలారన్నారు కామ్రేడ్ రామిరెడ్డి ( 72 ) ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు ఈ కార్యక్రమంలో. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాలెం నారాయణస్వామి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి కేశవరెడ్డి సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి సిపిఐ మండల పార్టీ కార్యదర్శి వెంకట రాముడు యాదవ్ సిపిఐ నాయకులు నారాయణ, ఆదినారాయణ యాదవ్, సుధాకర్ గౌడ్, రంగనాయకులు, లింగన్న ,శ్రీనివాస్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు

# పాదయాత్రకు ఐక్య విద్యార్థి సంఘాల మద్దతు

### ఆర్డిటి ఘనతతో వేల విద్యార్థులకు భవిష్యత్తు -విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్

**అనంతపురం, కళ్యాణదుర్గం జాన్ 18 ( రిపబ్లిక్ న్యూస్)**

కరువు జిల్లాలో విద్యాభివృద్ధికి సహకరించిన ఆర్డిటిని గొంతు నులుమే ప్రయత్నంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలో భాగమే. ఆర్డిటి సెట్ నిలుపుదల, ప్రస్తుత చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేజిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు. చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. అనంతరం ఆర్డిటి సంస్థ ఎఫ్ సి ఆర్ ఎ ను పునరుద్ధరించాలని సేవ్ ఆర్డిటి పేరుతో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ వైఎస్ఆర్సిపి కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పాదయాత్రకు వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని ఐక్య విద్యార్థి సంఘాలు(ఎస్ఎఫ్ఐ,ఐస, పిడిఎస్యు,ఆర్ వై ఎఫ్ ) మద్దతు ఇచ్చాయి నియోజకవర్గంలోని ఉల్లికల్లు గ్రామంలో పాదయాత్ర చేస్తున్న తలారి రంగయ్యని విద్యార్థి నాయకులు కలిసి వారితో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ,విద్యార్థి నాయకులు మాట్లాడుతూ అనంతపురంకి సంజీవినిల పనిచేసిన ఆర్డిటిని కేంద్రం కుట్రపూరితంగా అణచివేసే కుట్ర ఆర్ డి టి మీద విషం కక్కే ప్రయత్నం చేస్తుందని జిల్లాలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు



శ్రమించి ఎంతో మందికి జీవనాధారంగా ఉన్న ఆర్డీటీని సమూలంగా పెకలించి వేయాలనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఖండించారు, ప్రధానమంత్రి కుటుంబ సమేతంగా కలిసిన మంత్రి నారా లోకేష్ కి ఆర్డిటి సమస్య కనపడలేదా అన్నారుఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కొన్ని వేల మంది విద్యార్థులను ఆర్డిటి సెట్ ద్వారా కార్పొరేట్ కళాశాలలో చదివించి వారు ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి కృషి చేసిందన్నారు. కొన్ని లక్షల మందికి కార్పొరేట్ వైద్యాన్ని సైతం ఉచితంగాఅందించి వారికి ప్రాణాలకు భరోసాగా నిలిచిందన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఎంతో మంది నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత ఆర్డిటికే దక్కుతుందన్నారు. అలాంటి సంస్థను అనంతపురం నుంచి తరిమే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు..ఆర్డిటి పరిరక్షణ కోసం నడుం బిగించిన తలారి రంగయ్యకి విద్యార్థి , యువజన లోకం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు భవిష్యత్తులో ఆర్డిటి సంరక్షణకై ఎలాంటి కార్యక్రమం నిర్వహించిన స్వచ్ఛందంగా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐస రాష్ట్ర అధ్యక్షులు వేమన,ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బంగి శివ,పిడిఎస్యు రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్,విప్లవ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ వైయస్సార్ విద్యార్థి భాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ సుల్తాన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్, కళ్యాణదుర్గం నియోజకవర్గ అధ్యక్షులు అజయ్, జిల్లా కార్యదర్శి నిశాంత్,అనంతపురం నగర అధ్యక్షులు కైలాష్, కార్యదర్శులు ఫయాజ్,రాహుల్ రెడ్డి, గౌస్ భాష, కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు

# యోగాతో ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుంది






## జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కోవచ్చు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**అహోబిలం/నంద్యాల ప్రతినిధి, జూన్ 18, రిపబ్లిక్ న్యూస్:-** ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం అహోబిలం పుణ్యక్షేత్ర ప్రాంగణంలో 2000 మందిచే నిర్వహించిన 2025 యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ యోగ క్రియలు ఆచరించి ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. మన దేశంలో పుట్టిన యోగాను175 దేశాల్లో అవలంబిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాకు మరింత ప్రాచుర్యం వచ్చేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నెల రోజులపాటు యోగాకు సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన శ్రీశైలం, మహానంది, బెలుం గుహలు, అహోబిలంలలో నిర్వహించడం జరిగిందన్నారు. గురువారం రోజు పచ్చర్ల జంగిల్ క్యాంప్ లో కూడా యోగ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని టేక్కే మార్కెట్ యార్డులో 5200 మంది ప్రభుత్వ ఉద్యోగులందరిచే థిమాటిక్ యోగాను కూడా విజయవంతంగా పూర్తి చేసామన్నారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుకుంటున్న నేపథ్యంలో...జిల్లాలో 7.60 లక్షల మంది యోగా దినోత్సవంలో పాల్గొనడానికి యోగాంధ్ర యాప్ లో నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. యోగాంధ్ర యాప్ లో నమోదైన వ్యక్తులు గ్రామ, వార్డు సచివాలయ, మండల, జిల్లా స్థాయిల్లో గుర్తించిన 5 వేల ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం 5 వేల మంది యోగ శిక్షకులను తయారుచేసి వారి ద్వారా యోగాసనాలు నేర్పించడం జరుగుతోందన్నారు. మానవ దైనందిన జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని వాటిని పూర్తి స్థాయిలో అధిగమించేందుకు యోగ ద్వారానే సాధ్యమై మానసిక ధైర్యం సమకూరే అవకాశం ఉంటుందన్నారు. యోగా పోటీలకు సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పూర్తి చేసుకొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన బనగానపల్లె టీం వారు చేసిన యోగ స్కిట్ కు బహుమతి రావడంతో పాటు యోగ కార్యక్రమాలకు సంబంధించిన వీడియోకు ప్రథమ బహుమతి సాధించడం జరిగిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున యోగ శిక్షణ ఇచ్చిన పతంజలి, రామకృష్ణ మిషన్, నేచర్ గురువులు చక్కగా యోగాలో శిక్షణ ఇచ్చిన యోగ గురువులకు, కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దఎత్తున నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. యోగాంధ్ర యాప్ లో నమోదు చేసుకున్న వ్యక్తులందరూ ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని జెసి సూచించారు. అహోబిలంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థాన సిబ్బందికి అధికారులకు జెసి కృతజ్ఞతలు తెలిపారు.

అంతకుముందు యోగా చైతన్యమండలి గురువు దామోదర్ కుమార్ రెడ్డి, వారి బృంద సభ్యులు యోగాంధ్ర కార్యక్రమంలో వృక్షాసనము, వక్రాసనము, సేతు బందాసనం, తాడాసనం, ఉత్తాన పాదాసనము, పవనముక్తాసనము, అర్ధ చక్రాసనం, శలభాసనము, ఉష్ట్రాసనం, పాదహస్తానము, దండాసనము మొదలైన ఆసనాలను వేయించారు. అలాగే క పా ల బ ా తి , అనులోమ విలోమ, శీతలి, భ్రామరి మొదలైన విధానాలతో ప్రాణాయామం చేయించారు.

ఈ కార్యక్రమంలో అహోబిల దేవస్థానం సీఈఓ సౌందర్య రాజన్, ఆలయ ప్రధాన పూజారి రమేష్, నంద్యాల ఆర్డిఓ విశ్వనాథ్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి యశోధర, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, దేవస్థాన



సిబ్బంది, తదితరులు యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ

### 964 మంది చిన్న, సన్న కార రైతులకు రూ.1.99 కోట్లు రాయితీ విడుదల

### రైతులు పండించిన పంటకు ధర నిర్ణయించే స్థాయికి ఎదగాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల ప్రతినిధి, జూన్ 18, రిపబ్లిక్ న్యూస్ :- వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 964 మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీని విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో "వ్యవసాయ యాంత్రీకరణ (%ాహీూవీ%) సబ్-మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో అర్హులైన 964 మంది చిన్న, సన్నకారు రైతులకు రూ. 1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీని విడుదల చేసామన్నారు. సాగు నీటి లభ్యత, నల్లరేగడి భూములు జిల్లాలో అధికంగా ఉన్నాయని రైతులు అవసరమైన మేరకే నీటిని వినియోగించాలన్నారు. అధికంగా నీటిని వాడటం, మోతాదుకు మించి పురుగుల మందులు వాడకం ద్వారా భూమిలో ఉన్న పోషకాలు నశించి నిస్సారవంతమై దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా రైతులు సేంద్రీయ పద్ధతులు, పంట మార్పిడి, మిశ్రమ పంటలను వేసుకోవాలని సూచించారు. తద్వారా భూమిలో సూక్ష్మ పోషకాలు తిరిగి సమకూరి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ డ్రోన్స్ వినియోగించడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

జిల్లాలో బిపిటి నంద్యాల సన్న వరి రకం పండిస్తున్న సందర్భంగా రైతులు తొందరపడి విక్రయించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునేలా చూడాలన్నారు. అందుకు మార్కెటింగ్ శాఖ వారి సహకారంతో 145 గోడౌన్లు ఏర్పాటు చేయడం జరిగిందని వాటికి అవసరమైన రహదారి, మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. గిడ్డంగులలో పండించిన పంటలను నిల్వ చేసుకోవడం ద్వారా రానున్న రోజుల్లో మంచి ధర రావడం జరుగుతుందన్నారు. రైతులు అందరూ ఒకే పంట వేయకుండా వాతావరణ పరిస్థితులకు అణుగుణంగా పంటలు వేసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో నంద్యాల రకం యాపిల్ పండు కూడా మార్కెట్లోకి వచ్చే అవకాశం వుందన్నారు.

జపాన్ దేశంలో పండించే మియా జాకీ అనే మామిడి పండు అక్కడి వాతావరణ పరిస్థితులకు చెట్టుకు ఆరు పండ్లు కాస్తే, అదే చెట్టును జిల్లాలో వేయగా ఇక్కడి వాతావరణ పరిస్థితులకు వంద పండ్లు కాయడం జరుగుతోందన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, మెలకువలను రైతులు పాటిస్తూ పండించిన పంటకు వారే ధరను నిర్ణయించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్స్, గోడౌన్లు నాబార్డు, హార్టికల్చర్ వారి సహకారంతో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు యంత్ర పరికరాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేనప్పటికీ మోతాదుకు మించి వినియోగించకుండా చూడాలన్నారు. కల్తీ, నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జిల్లాలో లక్ష మంది కౌలు రైతులు ఉన్నారని, ఈ ఏడాది 30 వేల మంది రైతులకు సీసీ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌలుదారులకు ఇచ్చే సిసిఆర్సి కార్డులు 11 నెలలు చెల్లుబాటులో ఉంటుందన్నారు. కౌలు రైతులందరికీ పండించిన పంట ఆధారంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించామన్నారు. ఈ సంవత్సరం అదనంగా 20 శాతం రుణాలు మంజూరు చేసేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా పిజిఆర్ఎస్ హాల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు, సాంకేతికత పరంగా అవసరమైన సహాయ సహకారాల గురించి రైతులు వ్యవసాయ అధికారులను వివరించారు.

# అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది



**మహానంది, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై** ఉందని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హైటికాస్) ప్రతినిధి దూపాడు శ్రీధర్, వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో టీమ్ లీడర్ రాజశేఖర్ తెలిపారు. మహానంది సచివాలయం వద్ద వన్యప్రాణి చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు వన్యప్రాణులను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో పచ్చర్ల వద్ద జిల్లా స్థాయిలో ఉన్న సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహానందిలో ఆర్ అండ్ బీ సీఈ పూజలు

మహానంది, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్)

మహానందీశ్వర స్వామి సన్నిధిలో బుధవారం ఆర్ అండ్ బీ సీఈ వెంకటేశ్వరరావు, ఈఈలు శ్రీధర్ రెడ్డి, కృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు చేసి స్వామి వారి ప్రసాదాలు అందించారు.



ప్రజా దిన పత్రిక రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com